
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.8 | కనిష్ఠం 30.6
1
కామారెడ్డి
జిల్లా వార్తలు
బుధవారం 1 మే 2024



అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలి

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 30: వేసవి కాలం నేపథ్యంలో తీవ్రమైన ఎండలు, నీటి ఎద్దడి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అంతరాయాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, 24 గంటలు స్థానికంగా అందుబాటులో ఉండాలని సిబ్బందికి ఎస్ఈ రమేష్‌బాబు ఆదేశించారు. మంగళవారం సిరిసిల్లా రోడ్డులోని 33/11 సబ్‌స్టేషన్, కలెక్టరేట్ వద్ద గల 33/11 కేవీ రామారెడ్డి, దోమకొండ నుంచి సరఫరా అయ్యేలా ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ సాల్యానాయక్, ఏడీఈ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారానికి ఎండల ఎఫెక్ట్

- జిల్లాలో ఉదయం నుంచే దంచికొడుతున్న భానుడు
- ఓటర్లను కలిసేందుకు అభ్యర్థుల పాట్లు
- ఎండలో తిరిగేందుకు క్యాడర్ వెనుకంజ
- అభ్యర్థులు, క్యాడర్‌లో కనిపించని ఉత్సాహం
- బహిరంగ ప్రచారం, ర్యాలీలకు నేతల వెనుకడుగు
- సమావేశాలతోనే సరిపెడుతున్న పార్టీలు
- సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం

కామారెడ్డి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి):
లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి ఎన్నికల ఎఫెక్ట్ ఎదురవుతోంది. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. ఉదయం 10 దాటిందంటే సూర్యుడు సుర్రుమంటున్నాడు. సాయంత్రం 6 దాటినా ఎండ వేడి తగ్గడం లేదు. ప్రచార గడువు సమీపిస్తుండడంతో ఓటర్లను పూర్తి స్థాయిలో కలిసేందుకు సమయం లేక అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఇప్పటికే నామినేషన్ల ఘట్టం ముగియడంతో బరిలో ఉన్న అభ్యర్థులెవరో తేలిపోయింది. దీంతో ప్రచారంలో మరింత వేగం పెంచనున్నాయి. కాగా ఎండలు మండుతుండడంతో కార్యకర్తలు అభ్యర్థుల వెంట తిరిగేందుకు జంకుతున్నారు. జిల్లాలో ప్రతిరోజూ 43 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భానుడి ఉగ్రరూపంతో జనాలు కూడా ప్రచారానికి వచ్చేందుకు వెనుకడుగు వేస్తున్నారు. దీంతో ఆయా పార్టీల ప్రచారంలో జోష్ కనిపించకుండా పోతోంది. జిల్లా, మండల కేంద్రాలు, కొన్ని గ్రామాల్లోనే ప్రచార రథాలు కనిపిస్తున్నాయి. పలు గ్రామాలు, కాలనీల్లో అభ్యర్థులు లేకపోయినప్పటికీ ద్వితీయ శ్రేణి నాయకులతో ప్రచారం సాగుతోంది. అయితే అభ్యర్థులు రాకపోవడంతో ఓటర్లు ఎవరికి ఓటు వేయాలో తెలియకపోతున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థులు తమను నేరుగా కలవలేదని అభిప్రాయం వారిలో కనిపిస్తోంది.

మందకొడిగా ప్రచారం

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో బరిలో ఉన్న అభ్యర్థులెవరో తేలిపోయింది. అయినప్పటికీ అభ్యర్థులు బహిరంగంగా ప్రజలతో మమేకమై ప్రచారం నిర్వహించడం లేదు. ఫంక్షన్‌హాల్‌లో మాత్రమే కుల, యువజన, ముఖ్య కార్యకర్తల సమావేశాలు పెడుతున్నారు. అక్కడ సైతం రుమాలు, టవాళ్లు కట్టుకుని ప్రచారానికి వెళ్తున్నారు. ఇప్పుడే ఎండలు ఇలా ఉంటే మరో 13 రోజుల పాటు మరింత పెరుగుతాయని అప్పుడు జన సమీకరణ చేయడం కష్టమని నేతలు ఆందోళన చెందుతున్నారు. బహిరంగ సభలు, ర్యాలీలు సక్సెస్ కాకపోతే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పోతాయని ఎండలో ప్రచారం నిర్వహించడం ఈసారి కత్తిమీద సాము అని అభ్యర్థులు వాపోతున్నారు.

ప్రచార రథాలతోనే సరిపెడుతున్న పార్టీలు

ఓటర్లను నేరుగా కలిసి ప్రసన్నం చేసుకుంటే గాని ఓట్లు రాని పరిస్థితి నెలకొంది. ఇలాంటి తరుణంలో ప్రతీ ఓటరును కలుసుకోవడం అభ్యర్థులకు సాధ్యమయ్యేలా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో తమ గుర్తునైన ప్రజల వద్దకు చేర్చాలనే ఉద్దేశ్యంతో ప్రచార వాహనాలను ఆయుధాలుగా వినియోగిస్తున్నారు. నియోజకవర్గానికి రెండు, మూడు ప్రచార వాహనాలను సిద్ధం చేసి వాటి పరిధిలోని గ్రామాల్లో తిప్పుతున్నారు. ప్రధాన పార్టీలన్నింటిలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఎండల తీవ్రత కారణంగా ఓటర్ల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉండగా పార్టీ శ్రేణులతో సమావేశాలు నిర్వహిస్తూ గెలుపు దిశగా చేయాలంటూ పార్టీ ముఖ్య నాయకులు దిశా నిర్దేశం చేస్తున్నారు. అయినప్పటికీ ప్రచారం ఊపందుకోవడం లేదు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎక్కడ చూసినా ప్రచారం జోష్ కనిపించడం లేదు. ప్రచార సరళిపై ఆందోళన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు వీలైనంత మంది ఎక్కువ ఓటర్లను కలిసేలా కార్యాచరణ సిద్ధం చేసుకుంటున్నారు. ఎక్కువ మంది ఓటర్లు ఉన్న చోటుకు వెళుతూ ఓట్లు అభ్యర్థించేలా కార్యాచరణ రూపొందించుకుంటున్నారు.


సోషల్ మీడియా ద్వారా ప్రచారం

ఓటర్లను నేరుగా కలవడం కష్టమవుతున్న నేపథ్యంలో అభ్యర్థులు నియోజకవర్గాల వారిగా తమ క్యాడర్‌తో మొబైల్ నెంబర్లు సేకరిస్తున్నారు. ఆయా నెంబర్లకు ఐవీఆర్ఎస్, ఎస్ఎంఎస్‌లు పంపిస్తున్నారు. ఒక్కో ఎస్ఎంఎస్‌కు గరిష్ఠంగా ఇంగ్లీష్‌లో 160 పదాలు, తెలుగులో 70 పదాలు ఉండేలా ఆ ఖర్చు లెక్కలు చూపించి ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో అభ్యర్థులు ఎస్ఎంఎస్ ప్రచారాలను ప్రారంభించారు. సోషల్ మీడియా వేదికలైన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగామ్, ట్విటర్‌లో ప్రచారంపై నేతలు ప్రధానంగా దృష్టి సారించారు. అభ్యర్థులు ప్రత్యేక సోషల్ మీడియా టీంతో పాటు అనుచరులు, అభిమానులు, పోస్టింగ్‌లతో ప్రచార వేగాన్ని పెంచుతున్నారు.

సుర్రుమంటున్న సూరీడు

జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. 43 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ఎండల తీవ్రతకు తోడు వడగాలులు వీస్తుండడంతో బయటకు వెళ్లలేని పరిస్థితి.

ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి రాత్రి 10లోపు ప్రచారం చేసేలా ప్రణాళిక రూపొందించుకుంటున్నారు. ఉదయం పూట ఉపాధి హామీ పనులు, వ్యవసాయ పనుల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. మధ్యాహ్నం వేళలో గార్డెన్‌హాల్‌లలో సమావేశాలు నిర్వహిస్తున్నారు. మరికొందరు ముఖ్యనేతలతో ఎన్నికల వ్యూహాలు రచించడానికి కేటాయిస్తున్నారు. ఇలా ప్రచారం నిర్వహించడం ద్వారా ఆశించిన ఓట్లు వస్తాయోలేదోనని అభ్యర్థులు గుబులు చెందుతున్నారు.



లక్షా 32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- రూ.184 కోట్లు ధాన్యం డబ్బులు రైతులకు చెల్లింపు
- అదనపు కలెక్టర్ చంద్రమోహన్




ఎల్లారెడ్డిలో కొనుగోలు కేంద్రం వద్ద తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి, ఏప్రిల్ 30: ప్రస్తుత యాసంగి సీజన్‌లో జిల్లాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు ఒక లక్షా 32 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ తెలిపారు. ఆయన మంగళవారం మండలంలోని మాల్తుమ్మెద, తాండూరు, ఎల్లారెడ్డి మండలంలోని శివనగర్ గేట్ వద్ద గల ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద వరి ధాన్యంలో ఉన్న తేమ శాతాన్ని ఆయన పరిశీలించారు. కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని, కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆయన సొసైటీ సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు ఒక లక్షా 32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.184 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన తెలిపారు. ధాన్యం విక్రయించిన మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరుపుతున్నామని, స్థానికంగా గ్రామాల్లో హమాలీలు దొరకకపోవడంతో కొంత ఇబ్బందులున్నా, ఇతర రాష్ట్రాల నుంచి హమాలీలు వచ్చి పని చేస్తున్నారని తెలిపారు. గత సంవత్సరం యాసంగి సీజన్‌లో ఏప్రిల్ 29వ తేది వరకు 32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, రూ.5 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయగా, ప్రస్తుత యాసంగిలో ఏప్రిల్ 29వ తేది వరకు ఒక లక్షా 32 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, 184 కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు, గత సంవత్సరం కంటే ఏప్రిల్ మాసంలోనే లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికంగా కొనుగోలు చేశామన్నారు. ప్రస్తుత యాసంగిలో నాలుగు లక్షల 65 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసే లక్ష్యంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయ్ శేఖర్, మాల్తుమ్మెద సొసైటీ సీఈవో పవన్, తాండూర్ సొసైటీ సీఈవో జైపాల్‌రెడ్డి, ఆర్ఐ మహ్మద్, ఎల్లారెడ్డిలో పౌర సరఫరాల మేనేజర్ నిత్యానందం, రెవెన్యూ సిబ్బంది సహకార సంఘం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిప్పులు కురిపిస్తున్న సూర్యుడు

- జిల్లాలో 44 డిగ్రీల ఉష్ణోగ్రతల నమోదు
- ఉక్కబోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి



కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 30: జిల్లాలో సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు. పలు మండలాల్లో 44డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ప్రజలు ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బిచ్కుంద మండలంలో 44.3, కొల్లూర్‌లో 44.2, హసన్‌పల్లి 44.1, పల్వంచ 43.9, భిక్కనూర్ 43.8, పాత రాజంపేట 43.8, బొమ్మన్ దేవునిపల్లి 42.9, మేనూరు 42.7, బీబీపేట 42.6, తాడ్వాయి 42.5, లింగంపేట 42.5, రామారెడ్డి 42.3, పెద్దకొడప్‌గల్ 42.3, దోమకొండ 42.3, నస్రూల్లాబాద్ 42.2, పిట్లం 42.2, రామలక్ష్మన్‌పల్లి 42.2, బీర్కూర్ 421, గాంధారి 42.1, డోంగ్లీ 42.1, గాంధారి 42.1, నాగిరెడ్డిపేట 42.0, లచ్చపేట 41.9, ఇసాయిపేట 41.8, జుక్కల్ 41.5, సోమూర్ 41.4, ముక్తుంపూర్ 41.2, పుల్కల్ 41.0, సర్వపూర్ 40.9, ఆర్గోండ 40.4 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

పంచాయతీ గేట్‌కు తాళం వేసిన కాంట్రాక్టర్

బీర్కూర్, ఏప్రిల్ 30: బీర్కూర్‌కు చెందిన విజయ్ అనే కాంట్రాక్టర్ గత రెండేళ్ల క్రితం బీర్కూర్ గ్రామ పంచాయతీ దుకాణ సముదాయ భవన నిర్మాణ పనులు చేపట్టారు. పనులు పూర్తి చేసి రోజులు గడిచినా బిల్లులు మాత్రం అందలేదు. బిల్లుల చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై సదరు కాంట్రాక్టర్ ఆవేదన చెందాడు. మంగళవారం కాంట్రాక్టర్ విజయ్ బీర్కూర్ గ్రామ పంచాయతీ ప్రధాన గేట్‌కు తాళం వేసి తన నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం డీపీవో శ్రీనివాస్‌రావు బీర్కూర్ గ్రామ పంచాయతీకి వచ్చాడు. డీపీవో వచ్చిన విషయాన్ని తెలుసుకున్న కాంట్రాక్టర్ జీపీకి వచ్చి దుకాణ సముదాయ భవన నిర్మాణ పనులు చేపట్టి రెండేళ్ల గడిచినా బిల్లులు చెల్లించడం లేదని, తనకు బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారని డీపీవోను ప్రశ్నించారు. ఇదే విషయమై డీపీవోకు కాంట్రాక్టర్‌కు మధ్య చాలాసేపు వాగ్వాదం జరిగింది. ఆగ్రహానికి గురైన కాంట్రాక్టర్ పంచాయతీ ప్రధానగేట్‌కు తాళం వేశాడు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ విజయ్ మాట్లాడుతూ 2022 నుంచి ఇప్పటి వరకు తనకు రావాల్సిన రూ.పది లక్షల బిల్లు చెల్లించడంలో తీవ్రంగా జాప్యం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్లుగా ఇప్పుడు, అప్పుడు అంటూ బిల్లులు చెల్లించకుండా తనను వేధింపులకు గురి చేస్తున్నారంటూ కాంట్రాక్టర్ డీపీవో శ్రీనివాస్‌రావు ముందు తన ఆవేదన వ్యక్తపరిచాడు. రూ.30 లక్షలు ఖర్చు చేసి గ్రామ పంచాయతీ దుకాణాల సముదాయ భవనాలను నిర్మించానని తెలిపాడు. ఇందులో రూ.20 లక్షల బిల్లు చెల్లించారని, మిగతా రూ.పది లక్షల బిల్లు చెల్లించడానికి అధికారులు జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అప్పు చేసి భవనం నిర్మించానని, బిల్లులు ఇవ్వకపోవడం వల్ల వడ్డీలు పెరిగి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించకుంటే తనకు ఆత్మహత్యే శరణ్యం అని విజయ్ అధికారి ఎదుట కంటతడి పెట్టాడు. డీపీవో శ్రీనివాస్‌రావు కాంట్రాక్టర్‌తో మాట్లాడుతూ తనకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో కాంట్రాక్టర్ విజయ్ లిఖిత పూర్వకంగా డీపీవోకు ఫిర్యాదు చేశారు.



బీర్కూర్ జీపీ ప్రధాన గేట్‌కు తాళం వేస్తున్న కాంట్రాక్టర్

పదిలో.. 19వ స్థానం!

- జిల్లాలో బాలికలదే పై చేయి
- పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో 92.71 ఉత్తీర్ణత శాతం
- 11,926 మంది విద్యార్థులకు.. ఉత్తీర్ణులైన విద్యార్థులు 11,057
- 6,047 మంది బాలికలకు గాను.. 5,706 మంది పాస్
- 5,879 మంది బాలురకు గాను.. 5,351 మంది ఉత్తీర్ణత
- జిల్లాలో 132 మంది విద్యార్థులకు 10/10 జీపీఏ
- 47 మంది ప్రభుత్వ పాఠశాలలో నూటికి నూరు శాతం పాస్
- 85 మంది ప్రైవేట్ పాఠశాలల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత

కామారెడ్డి టౌన్, మే 10: రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో కామారెడ్డి జిల్లా 19వ స్థానంలో నిలిచింది. గత సంవత్సరం జిల్లాకు 7వ ర్యాంక్ రాగా ప్రస్తుతం 19వ ర్యాంక్ సాధించింది. ఈ పదో తరగతి ఫలితాల్లో బాలికల హవానే కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా 11,861 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా ఇందులో 11,069 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలికలు 6,047 మందికి గాను 5,706 మంది (94.36 శాతంతో) ఉత్తీర్ణత సాధించారు. 5,879 మంది బాలురలకు గాను 5,351 మంది(91.02 శాతం) ఉత్తీర్ణత సాధించారు. జిల్లా వ్యాప్తంగా 132 మంది విద్యార్థులు 10/10 జీపీఏను సాధించారు. ఈ ఫలితాల్లో 47 ప్రభుత్వ పాఠశాలలు, 85 ప్రైవేట్ పాఠశాలలు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. 105 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించగా అందులో 66 ప్రభుత్వ పాఠశాలలు, 39 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల హవా

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో కామారెడ్డి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. 47 మంది విద్యార్థులు 10/10 జీపీఏ సాధించారు. ఎయిడెడ్ పాఠశాలలో 18 మంది విద్యార్థులకు గాను 14 మంది, బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో 384 మందికి గాను 384 మంది, ప్రభుత్వ పాఠశాలలో 360 మంది విద్యార్థులకు గాను 304 మంది, కేజీబీవీలో 720 మందికి గాను 679 మంది, మోడల్ పాఠశాలలో 575 మందికి గాను 555 మంది, రెసిడెన్షియల్ పాఠశాలల్లో 53 మందికి గాను 52 మంది, మైనార్టీ రెసిడెన్షియల్‌లో 245 మందికి 241, ఎస్‌డబ్ల్యూఆర్ పాఠశాలల్లో 836 మందికి గాను 828 మంది, టీడబ్ల్యూఆర్ 314 మందికి గాను 308 మంది, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 6,198 మందికి గాను 5,503 మంది విద్యార్థులు పాసయ్యారు. కామారెడ్డి మండలంలోని గర్గుల్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన రసజ్ఞ, టీఎంఆర్ఈఐఎస్ పాఠశాలలో గౌసియా అనే విద్యార్థిని 10/10, లింగంపేట మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి సాయిశ్రీ తేజ, మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన షెహబాజ్‌తో పాటు పలు మండలాల్లోని విద్యార్థులు 10/10 జీపీఏలను సాధించారు. గతంలో కంటే పోల్చితే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో నూటికి నూరు శాతం ఫలితాలు చాలా వరకు తగ్గిపోయాయి. ఎప్పటిలాగానే బాలుర కంటే బాలికలే ఎక్కువ శాతం 10/10 జీపీఏలను సాధించారు. 81 ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు సాధించారు. అలాగే కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో 85 మంది విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు.




రోహిణి (10/10)
దోమకొండ జడ్పీహెచ్ఎస్



ప్రజ్ఞ (10/10)
పాల్వంచ జడ్పీహెచ్ఎస్



దీప్తి (9.8/10)
పాల్వంచ జడ్పీహెచ్ఎస్



అద్వైత (9.8/10)
పాల్వంచ జడ్పీహెచ్ఎస్



మోస్రాలో నిర్మించిన షాదీఖానా ఇదే..

ముచ్చటగా కట్టారు.. ముట్టకుండా వదిలేశారు!!

● మోస్రాలో మందుబాబులకు అడ్డాగా మారిన షాదీఖానా

మోస్రా, ఏప్రిల్ 30: మండలకేంద్రంలో 31-08-2015న అప్పటి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కేటీఆర్, నాటి వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో రూ.35లక్షల వ్యయంతో షాదీఖానా నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. 05-06-2018 నాటికి నిర్మాణ పనులు పూర్తవ్వగా.. పోచారం శ్రీనివాస్ రెడ్డి షాదీఖానా భవనాన్ని ప్రారంభించారు. నిర్మించిన వాడుకోకుండా అలానే వదిలేశారు. పిచ్చిమొక్కలతో పాడైపోతున్నా.. పట్టించుకోకుండా వదిలేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి వేళలలో చీకటిమయంగా మారింది. షాదీఖానా బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మాణం జరిగింది. ఇందులో మత ఆచారం ప్రకారం నిర్మాణం చేయలేదని ముస్లిం మత సంప్రదాయం ప్రకారం పురుషులు, మహిళలు వేరుగా ఉండే విధంగా ఏర్పాట్లు చేసుకుంటారు. అలాంటి అవకాశం లేనందున ఇక్కడ కార్యక్రమాలు చేయట్లేదని స్థానికులు వాపోతున్నారు. నిరుపయోగంగా ఉండడంతో 2023లో రూ.20లక్షలు మంజూరైనా.. ఇప్పటి వరకు పనులు చేపట్టలేదని మసీద్ సదర్ మతిన్ తెలిపారు. నిరుపయోగంగా ఉన్నందున బాత్‌రూమ్‌లకు సంబంధించిన తలుపులు ధ్వంసం చేశారని, వన్ హెచ్‌పీ మోటార్ సైతం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని స్థానికులు తెలిపారు. ఏది ఏమైనా నిర్మాణ సమస్యలు పరిష్కారం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై వివరణ నిమిత్తం పంచాయతీ రాజ్ ఏఈ పవన్‌ను వివరణ కోరగా ఫోన్ చేస్తే స్పందించలేదు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

ఎడపల్లి, ఏప్రిల్ 30: ఎడపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవ వేడుకలను ఎడపల్లి గౌడ కులస్థులు, గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గత శుక్రవారం నుంచి ప్రారంభం అయిన కల్యాణ మహోత్సవ వేడుకలు మంగళవారం ఎల్లమ్మ కళ్యాణంతో ముగిశాయి. ఉదయం నుండి గౌడ కులస్థులు బాజా బజంత్రీలతో ఐరండ్లు, మంగళ సూత్రం, మట్టెలు, తల్వాల బియ్యంను ఎదుర్కొని అమ్మ వారి కల్యాణం నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ వేడుకల్లో గౌడ కులస్థులు, వారి బంధువులు, ప్రజలు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో హాస్టళ్లు తెరిచి ఉంచాలి

● రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేసిన గిరిజన శక్తి నాయకులు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 30: యూనివర్సిటీ వేసవి సెలవుల్లో హస్టళ్లు తెరిచి ఉంచాలని గిరిజన శక్తి నాయకులు మంగళవారం వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ. యాదగిరికి వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు భోజన వసతి కల్పించాలని డిమండ్ చేశారు. వర్సిటీలో చదువుతన్న విద్యార్థులంత పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారని, మెస్ బిల్లులు వర్సిటీ భరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన శక్తి సంఘం ప్రతినిధులు మోహన్ నాయక్, ప్రవీణ్ కుమార్, మౌసింగ్, రాము, తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 30: జిల్లా ఇంచార్జి వైద్య శాఖ అధికారిగా తుకారాం రాథోడ్ నియమితులయ్యారు. ఇదివరకు డిఎంహెచ్‌వోగా పనిచేసిన సుదర్శనం మంగళవారం ఉద్యోగ విరమణ చేయడంతో తుకారాం రాథోడ్‌కు ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. గత ఐదేళ్లుగా ఇంచార్జి డిఎంహెచ్‌వోగా సుదర్శనం పనిచేస్తున్నారు. పూర్తిస్థాయి డిఎంహెచ్‌వో నియామకం అయ్యేంతవరకు తుకారాం రాథోడ్ ఇంచార్జిగా వ్యవహరించనున్నారు.

మస్కట్‌లో తప్పిపోయిన వాడి గ్రామవాసి

● స్వదేశానికి రప్పించాలని తల్లిదండ్రుల వినతి

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్30: వేల్పూర్ మండలం వాడి గ్రామానికి చెందిన గోలి శివప్రసాద్ ఓమన్ రాజధాని మాస్కట్‌లో తప్పిపోయినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుమారుడిని స్వదేశానికి రప్పించేందుకు కృషి చేయాలని ప్రవాస భారతీయుల హక్కులు సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడిని మంగళవారం వినతిపత్రం అందజేశారు. గోలి శివప్రసాద్ ఈనెల 17వ తేదీన మాస్కట్‌కు వీసాపై వెళ్ళాడని స్థానిక కంపెనీలో రిపోర్ట్ చేసిన రెండు రోజులకే తప్పిపోయాడన్నారు. ప్రస్తుతం ఎక్కడ ఉన్నది తమకు తెలియదని ఆవేదన వ్యక్తం చేశారు. శివప్రసాద్‌కు సంబంధించిన ఫోన్, ఇతర వస్తువులు రూంలోనే వదిలివెళ్ళినట్టు తెలిసిందన్నారు. స్పందించిన కోటపాటి ఓమన్‌లోని తెలుగు ప్రవాసీయుల సంక్షేమ సంఘం ప్రతినిధి గుండెటి గణేష్‌కు తప్పిపోయిన శివప్రసాద్ వివరాలను పంపి వేతికిపట్టుకొని స్వదేశానికి పంపాల్సిందిగా కోరారు.

సిరికొండలో తూనికల కొలతల అధికారుల దాడులు

● ఆరుగురి కేసులు నమోదు

సిరికొండ ఏప్రిల్ 30: సిరికొండ మండల కేంద్రంలో తూనికల కొలతల అధికారులు వ్యాపార సంస్థలపై దాడులు చేసి వస్తువులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.జిల్లా తూనికలకొలతల అధికారి ముహమ్మద్ షుజాత్ ఆధ్వర్యంలో సిరికొండలో వ్యాపార సంస్థల్లోకి వెళ్లి తనిఖీలు చేశారు. ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. 21వేల జరిమానాలను వసూలు చేశారు. ఈ దాడుల్లో నిజామాబాద్ జోన్ సహాయ కంట్రోలర్ నిర్మల్‌కుమార్,సీనియర్ సాంకేతిక అధికారి రవీందర్,సాంకేతిక సహాయకులు సురేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు కార్పొరేటర్లు

● ఎన్నికల వేళ బీఆర్ఎస్‌కు షాక్

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 30: పార్లమెంట్ ఎన్నికల వేళ నిజామాబాద్ అర్బన్‌లో బీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. మంగళవారం నగరానికి చెందిన ముగ్గురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డిల సమక్షంలో వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. 46వ డివిజన్ కార్పొరేటర్ అక్బర్ హుస్సేన్, 10వ కార్పొరేటర్ కోమలితో పాటు అర్సపల్లి కార్పొరేటర్ లావణ్య నవీన్‌లు బీఆర్ఎస్‌లో చేరారు. ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ నగరంలోని నిజాంపంక్షన్‌హాల్‌లో జరిగిన హజ్ కమిటీ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు.ఆయనతో పాటు ఎంపీఅభ్యర్థి జీవన్‌రెడ్డి,వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖుస్రో పాషా, ఉర్దూ అకాడమి చైర్మన్‌తాహెర్‌బిన్ హుందాన్‌లు పాల్గొన్నారు.

● ప్రచారం నిర్వహించిన మహేష్‌గౌడ్

పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ మంగళవారం నగరంలోని కంఠేశ్వర్, కుర్నావాడ, ఎస్సీ కాలనీ, హౌజింగ్ బోర్డు, విద్యుత్‌నగర్‌లలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రచారంలో భాగంగా కూరగాయలు అమ్మే వారితో మాట్లాడి సరదాగా కూరగాయలు అమ్మారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నాయకులు గడుగు గంగాధర్, కేశవేణు, రత్నాకర్, తదితరులు ఉన్నారు.


కాంగ్రెస్ పార్టీలో చేరిన కార్పొరేటర్లు

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో పెరిగిన ఉత్తీర్ణత శాతం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 30: పదో తరగతి పరీక్షల ఫలితాల్లో డిచ్‌పల్లి మండల విద్యార్థులు 93.04శాతం ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాశాఖ అధికారి రాజగంగారాం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన వనిత, డిచ్‌పల్లి ఆదర్శ పాఠశాలకు చెందిన మంద అమూల్య, కేజీబీవీ పాఠశాలకు చెందిన అమృతా,సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మనోజలు 10జీపీఏ సాధించినట్లు ఎంఈవో తెలిపారు. ధర్మారం(బి) సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు 99శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. కావ్య లహరి 9.8, 25మంది విద్యార్థులు 9.9 జీపీఏ సాధించారని సంగీత పేర్కొన్నారు. ఆదర్శ పాఠశాలలో 20మంది విద్యార్థులు 9.0జీపీఏ మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలోని 2023-2024 సంవత్సరంలో పదవ తరగతి పరీక్షల్లో మండలంలో 97 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి రామారావు తెలిపారు. 403 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా అందులో 391 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల విద్యార్థునులు నితీశా, రమ్యలు 10 జీపిఏ సాధించారు. మహాత్మా జ్యోతిభాపూలే విద్యార్థి 10 జీపీఏ సాధించినట్లు ఆయన తెలిపారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలంలోని వివిధ పాఠశాలల్లో పదవ తరగతిలో 94శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో రాజగంగారాం తెలిపారు. 1849మంది విద్యార్థులు హాజరు కాగా 1742మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని వీరిలో 10జీపీఏ 36మంది విద్యార్థులు సాధించారన్నారు. ప్రభుత్వ పాఠశాల నుంచి 21మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి 15మంది విద్యార్థులు 10జీపీఏ సాధించారన్నారు. అక్స్‌ఫర్డ్ పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు 10జీపీఏ, శ్రీ బాషిత పాఠశాలలో ఒకరు 10జీపీఏ సాధించినట్టు కరస్పాండెంట్‌లు మానస గణేష్, బాషిత సుందర్‌లు తెలిపారు. పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు వచ్చేనెల 16వ తేదీలోపు తాము చదివిన పాఠశాలలో పరీక్ష ఫీజు చెల్లించి జూన్ 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సప్లమెంటరీ పరీక్షలకు హాజరుకావాలని ఎంఈవో కోరారు.

● ఆలూర్ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత

ఆలూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్టు హెచ్ఎం నరేంధర్ తెలిపారు. వీరిలో ఆరుగురు విద్యార్థులు 10జీపీఏ సాధించారన్నారు. అదే విధంగా ఆలూర్‌లోని తెలంగాణ మైనారిటీ బాలుర పాఠశాలలో ఆరుగురు విద్యార్థులు 10జీపీఏ సాధించగా వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ సయ్యద్ హైదర్ తెలిపారు.

పెర్కిట్: పది పరీక్ష ఫలితాల్లో ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ మోడల్ పాఠశాల విద్యార్థులు ఏడుగురు విద్యార్థులు 10జీపీఏ సాధించగా 98 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ ప్రవీన్‌కుమార్ తెలిపారు. మోడల్ పాఠశాలలో రోహిణి, వేదశ్రీ, సయ్యద్‌అహ్మద్, కీర్తి, పునిత్, అఫియా, వాసవిలు 10జీపీఏ సాధించారని, పాఠశాలలో 98మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా వారిని పాఠశాల ప్రిన్సిపాల్ ప్రవీన్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

జక్రాన్‌పల్లి: మంగళవారం విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జక్రాన్‌పల్లి మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఆరుగురు విద్యార్థులు 10జీపీఏ సాధించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వి.శంకర్, కె.హర్షిత, అక్స్‌ఫర్డ్ పాఠశాలలో శ్రీజారెడ్డి, రాంరాజ్, సోనికుమారి, జక్రాన్‌పల్లి టీఎస్ఎంఎస్ ఎం.మధురి 10జీపీఏ సాధించి మండల టాపర్‌లుగా నిలిచారు. తొర్లికొండ, కొలిప్యాక్, జక్రాన్‌పల్లి కేజీబీవీ, పడకల్, కలిగోట్, చింతలూర్, లక్ష్మాపూర్, వివేకానంద స్కూల్, అక్స్‌ఫర్డ్, జక్రాన్‌పలిల టీఎస్ఎంఎస్, మునిపల్లి, కేశ్‌పల్లి, సికింద్రాపూర్, అర్గుల్, బ్రహ్మణ్‌పల్లి పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. జక్రాన్‌పల్లి మండలం నుంచి ఆరుగురు విద్యార్థులు 10జీపీఏ సాధించడం పట్ల విద్యార్థులను ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ రూరల్ మండల విద్యార్థులు పదో తరగతి పాఠశాలలో తమ సత్తా చాటారు. మండలంలో మొత్తం 10 పాఠశాలలకు చెందిన 288 మంది విద్యార్థలు పది పరీక్షలు రాశారు. వారిలో 275 మంది ఉత్తీర్ణత సాధించారు. గుండారం జెడ్పీహెచ్ఎస్, ఖానాపూర్ జెడ్పీహెచ్ఎస్, కాలూరు జెడ్పీహెచ్ఎస్, తిర్మన్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు నూరుశాతం పాస్ అయ్యారు. గుండారం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు నలుగురు 9.7 జీపీఏ సాధించినట్లు పాఠశాల హెడ్మాస్టర్ జి.అమర్‌నాథ్, డాక్టర్ కాసర్ల నరేష్‌రావులు తెలిపారు. 9.7 జీపీపీఏ సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

సిరికొండ: ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సిరికొండ మండలానికి చెందిన తొమ్మిది ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో విద్యార్థులు నూటికి నూరు శాతం ఫలితాలు సాధించారు. మహత్మ జ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని ఒకరు, ఓ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు పదికి పది జీపీఏ పాయింట్లు సాధించారు. 562 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 544 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.గడ్కోల్, కొండూర్,న్యావనంది,సిరికొండ,మాడల్ స్కూల్, కేజీబీవీ, మహాత్మజ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాల చీమన్‌పల్లి, సిరికొండ హైస్కూల్లో అక్షర 9.8, అక్షయ 9.5 జీపీఏ పాయింట్లను సాధించారు. మోడల్ స్కూల్లో గుణకరన్, హర్షిని,9.8 జీపీఏ , కృతిక 9.7 జీపీఏ పాయింట్లను సాధించారు.మండలానికి చెందిన విద్యార్థులు మంచి జీపీఏ పాయింట్లను సాధించి మండలానికి మంచి పేరు తీసుకొచ్చారు.

కమ్మర్‌పల్లి: మంగళవారం విడుదల చేసిన పదవతరగత పరీక్ష ఫలితాల్లో కమ్మర్‌పల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో 95.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా మండంలోని చౌట్‌పల్లి, హసాకొత్తూర్, కోనాపూర్ ఉన్నత పాఠశాలలో వదంశాతం రిజల్ట్ సాధించగా 4 ప్రైవేటు పాశాలలు (మినిమి, విజ్ఞానజ్యోతి, ఉషాజ్యోతి, శ్రీవిద్యాసాయి పాఠశాలలు) వంద శాతం రిజల్ట్ సాధించాయి.

ధర్పల్లి: మండల కేంద్రంలోగల మోడల్ పాఠశాల విద్యార్థులు మంగళవారం ప్రకటించిన ఎస్సెస్సీ పరీక్షల్లో సత్తా చాటారు. పాఠశాలకు చెందిన చాట్ల చందన, సభావత్ అంకిత, లోలం మేఘన, పద్మ అక్షయ, మేగావత్ పల్లవిలు 10జీపీఏ సాధించారు. అదే పాఠశాలకు చెందిన 29 మంది విద్యార్థులకు 9కి పైగా జీపీఏలు సాధించి మండలంలోనే మోడల్ పాఠశాల విద్యార్థులు తమ సత్తాను చాటారు. పాఠశాలల్లో 99 శాతం ఉత్తీర్ణత సాధించారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులను మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ రాజేందర్ సాహెబ్, పాఠశాల వీడీసీ అభినందించారు.

నవీపేట: ఇటీవల మార్చిలో జరిగిన పదవ తరగతి వార్షిక పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేయగా నవీపేట మండలంలో 94శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఇన్‌చార్జి ఎంఈవో గణేష్ రావు తెలిపారు. నవీపేట జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల 86శాతం, నవీపేట జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల 92శాతం, జడ్పీహెచ్ఎస్ నాగేపూర్ 85శాతం, జడ్పీహెచ్ఎస్ అభంగపట్నం 81శాతం, జడ్పీహెచ్ఎస్ దర్యాపూర్ ఉర్దూ మీడియం 86శాతం, జడ్పీహెచ్ఎస్ జన్నేపల్లి 96శాతం, జడ్పీహెచ్ఎస్ బినోల వందశాతం, జడ్పీహెచ్ఎస్ నాళేశ్వర్ వందశాతం, మోకన్‌పల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల 98శాతం, నవీపేట టీఎస్ మోడల్ పాఠశాల 98శాతం, ఉన్నత పాఠశాల నవీపేట వందశాతం, తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల నవీపేట 93 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఆయన పేర్కొన్నారు. మండలంలో 583మంది విద్యార్థులకు గాను 549మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా 34మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారని ఆయన పేర్కొన్నారు.

‘ప్రజా ఉద్యమాలు చేయడానికి తోడ్పడుతాయి’

పెద్దబజార్, ఏప్రిల్ 30: కార్మిక వర్గం, రైతాంగం, శ్రమజీవులు అందరికి అండగా ఉంటూ ప్రజా ఉద్యమాలు చేయడానికి తోడ్పడుతాయని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. మంగళవారం నగరంలోని కోటగల్లిలోగల ఎన్ఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అఖిల భారత మహాసభలు విజయవంతంగా ముగిసిన అన్నారు. పార్టీలో పనిచేస్తున్న 14 రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతినిధులు, ఆయా రాష్ట్రాల మహాసభల్లో ఎన్నుకోబడిన వారు కేంద్ర మహాసభలో పాల్గొన్నారని అన్నారు. పీవోఆర్ ప్రస్తుత పరిస్థితులు కార్యక్రమం పంథాలను ఏకగ్రీవంగా ఆమోదించుకోవడం జరిగిందన్నారు. నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని సాధించడానికి విప్లవ పంథాను పార్టీ మహాసభ ఆమోదించిందని విప్లవ పంథాను ఎత్తిపట్టిందని భారత ప్రజల విప్లవ పోరాటాల అనుభవాలను పంథాకు ప్రాథమిక పునాధిగా చేసుకున్నట్లుగా డాక్యుమెంట్‌లో పేర్కొన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు వేల్పూర్ భూమయ్య, డివిజన్ నాయకులు శివకుమార్, జల్ల మురళి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆకుల పాపయ్య

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. మరొకరికి గాయాలు

ఎడపల్లి, ఏప్రిల్ 30: ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామ చెరువుకట్టపై దర్గా దగ్గర సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలు అయినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి జానకంపేట గ్రామానికి చెందిన కార్తీక్ (19), అర్బాస్ ఖరేషి (18) ఇద్దరు స్నేహితులు సారంగపూర్ గ్రామంలో గల రాయల్ ఫంక్షన్ హాలులో విందుకు హాజరయి తిరిగి వస్తుండగా బోదన్ నుండి నిజామాబాద్ వైపు వెలుతున్న ఏపి 28 ఏఎన్ 8012 నంబరు గల ఇన్నోవా వాహనం వేగంగా ఢీకొనడంతో అర్బాస్ ఖురేషి గాయాలతో రోడ్డు పై పడ్డాడు. ఇది చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో గాయపడ్డ వ్యక్తిని చికిత్స నిమిత్తం నిజామాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తిరిగి ఉదయం చెరువులో వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి వెల్లి వెలికి తీయగా అతను రాత్రి వాహనం ఢీకొట్టడంతో మరణించాడని అతని పేరు కార్తిక్‌గా గుర్తించారు. కార్తీక్ వాహనం ఢీ కొనడంతో ఎగిరి చెరువులో పడడంతో అతనిని ఎవరూ చూడలేదు. అర్బాస్ ఖురేషి తండ్రి ఖాజా ఖురేషి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను గెలిపించాలి

● బోధన్‌లో పార్టీ నాయకుల ప్రచారం

బోధన్‌రూరల్,ఏప్రిల్30: బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను పార్లమెంట్ ఎన్నికలలో భారీ మెజారిటీతో గెలిపించాలని జడ్పీ చైర్మన్ దాదన్న గారి విఠల్ రావు అన్నారు. మంగళవారం బోధన్ మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో ఆయన సతీమణి ఆయేషా ఫాతిమా ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బుధవారం బోధన్ పట్టణంలోని రమాకాంత్ కల్యాణ మండపంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలచే భారీ సమావేశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ హజరు కానున్నారన్నారు. ఎంపీ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సతీమణి ఆయేషా ఫాతిమా, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటేశ్వర్ రావు దేశాయ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అబీద్, ఫ్లోర్ లీడర్ గంగారాం, అశ్వక్, తోకల గంగారెడ్డి, నక్క లింగారెడ్డి, రుద్ర సత్యనారాయణ, బీర్కూర్ బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

కూనేపల్లిలో వ్యక్తి మృతి

రెంజల్, ఏప్రిల్ 30 : మండలంలోని కూనేపల్లి గ్రామానికి చెందిన సరుకు గురప్ప(65)అనే వ్యక్తి మృతి చెందాడని ఎస్‌ఐ సాయన్న తెలిపారు.ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కూనేపల్లి గ్రామానికి చెందిన గురప్ప జనవరి నెలలో టీవీఎస్ ఎక్సెల్ నడుపుతూ రెంజల్ బ్రిడ్జి వద్ద కింద పడడంతో గాయాలైన గురప్ప తన కొడుకు సాయిలు వద్ద జీవనం సాగిస్తున్నాడు. గత వారం రోజుల క్రితం తన స్వగ్రామామైన కూనేపల్లికి వచ్చిన గురప్ప గ్రామంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం హోటల్ నందు టిఫిన్ చేస్తూ బెంచీపై నుండి కింద పడి అక్కడికక్కడే మృతి చెందడం జరిగిందని గ్రామస్థులు తెలిపారని ఎస్‌ఐ తెలిపారు. భిక్షాటన చేస్తూ ఎండలో తిరగడంతో వడదెబ్బ తగిలి ఆరోగ్యం క్షీణించి మృతి చెందడం జరిగిందని స్థానికులు తెలపడంతో సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ సాయన్న పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని శవం లభ్యం

రుద్రూరు,ఏప్రిల్ 30: ఓ గుర్తు తెలియని శవం లభ్యమైన సంఘ టన రుద్రూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం రుద్రూరు గ్రామశివారులోని కామ..దేను రైస్‌మిల్ వెనుకలో గుర్తు తెలియని మగ శవం లభిం చింద న్నారు. అతని మెడలో హనుమంతుని లాకెట్, నడుముకి తెల్లని మొలతాడు, లూంగీ, తెల్లని షర్టు ధరించి ఉన్నాడని పేర్కొన్నారు. గుర్తు తెలి యని శవాన్ని బోధన్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించినట్లు తెలి పారు.ఆవ్యక్తికి సంబంధించిన సంబంధీకులు ఎవరైనా ఉంటే, వివ రాలు తెలిస్తే రుద్రూరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి ఒకరి మృతి

ఖిల్లా, ఏప్రిల్ 30: నగర శివారులోని మాధవనగర్ రైల్వే గేట్ సమీపంలో ఇంటర్‌సిటీ రైలు కింద పడి ఒక వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మృతుడు ఆదర్శ నగర్ ప్రాంతానికి చెందిన రాజవరపు శ్రీనివాస్‌గా గుర్తించినట్లు తెలిపారు. తన కుటుంబ ఆర్థిక సమస్యలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తుందని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్30: వేల్పూర్ మండలం కుకునూర్ గ్రామానికి చెందిన బోజపల్లి చిన్న గంగారాం (56) అనే వ్యక్తి అదృశ్యమైనట్టు కుటుంబ సభ్యులు మంగళవారం వేల్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో చిన్నపాటి గొడవ కారణంగా సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్ళి ఇంటికి తిరిగి రాలేదన్నారు. చిన్న గంగారాం కుమారుడు రాకేష్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై వినయ్ తెలిపారు. ఇట్టి వ్యక్తి ఎవరికైనా కనిపిస్తే 8712659862నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

బోధన్‌రూరల్,ఏప్రిల్30: బోధన్ పట్టణం శక్కర్‌నగర్ రామ మందిరం వద్ద మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి(35)మృతదేహం లభించినట్లు బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. మృతదేహన్ని బోధన్ ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చామన్నారు. అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

నాళేశ్వర్‌లో వీడీసీ సభ్యులపై కేసు

నవీపేట,ఏప్రిల్30: మండలంలోని నాళేశ్వర్‌కు చెందిన పలువురు వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్‌ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మండంలోని ఆశాజ్యోతి కాలనీకి చెందిన మహిళ ఇల్లు నిర్మించుకోవడానికి పది ట్రాక్టర్ల ఇసుక కొరకు మండల రెవెన్యూ కార్యాలయంలో డీడీ చెల్లించిందని ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించి తహసీల్దార్ నారాయణ 10ట్రాక్టర్ల ఇసుకను మంజూరు చేస్తూ అనుమతులు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. సోమవారం సంబంధిత ఇంటి నిర్మాణానికి మూడు ట్రాక్టర్ల ద్వారా నాళేశ్వర్ వాగు నుండి ఇసుకను తరలిస్తుండగా స్థానిక వీడీసీ సభ్యులు సంబంధిత ట్రాక్టర్లను అడ్డుకుని స్వాధీనం చేసుకున్నారని ఆయన పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం సంబంధిత ట్రాక్టర్లను యాజమానులకు అప్పగించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం తహసీల్దార్ అనుమతులు తీసుకుని ఇసుకను తరలిస్తున్నప్పటికీ నాళేశ్వర్ వీడీసీ సభ్యులు అడ్డుకోవడంపై తహసీల్దార్ నారాయణ నాళేశ్వర్ వీడీసీ సభ్యులపై ఫిర్యాదు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంపై పలువురు నాళేశ్వర్ వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్‌లోకి గూపన్‌పల్లి బీఆర్ఎస్ నాయకులు

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్, 30: జిల్లా కేంద్రంలోని 3వడివిజన్ పరిధిలోని గూపన్‌పల్లికి చెందిన బీఆర్ఎస్ నేత లు,కార్యకర్తలు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో రూరల్ ఎమ్మె ల్యే డాక్టర్ భూపతి రెడ్డిని కలిశారు. మాజీ ఎంపీటీసీ మాంతం లక్ష్మణ్, ఇతర బీఆర్ఎస్ నేతల కు ఎమ్మెల్యే భూపతిరెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బాగర్తి బాగారెడ్డి, జలందర్‌రెడ్డి, లింగం, గంగాధర్ తదితరులున్నారు.

3న ఆర్చరీ ఉచిత శిక్షణ ఎంపికలు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 30: జిల్లా యువజన మరియు క్రీడలశాఖ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన సాయి ఆధ్వర్యంలో విలు విద్యలో ఉచిత శిక్షణ శిబిరంలో ఎంపికలను నిర్వహిస్తున్నట్లు అధికారి ముత్తెన్న తెలిపారు.9 నుం చి 18 సంవత్సరాలలోపు యువతీ యువకులు నేరుగా నాగారంలోని రాజా రాం స్టేడియంకు ఎంపికల కోసం హాజరుకావాలని అన్నారు. ఆసక్తి గల క్రీడాకారులకు ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్ హైట్, వెయిట్, తదితర విభాగాల్లో పో టీలు ఉంటాయని ఇందులో ఎంపికైన వారిని ఉచిత శిక్షణ శిబిరానికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఒక ఫోటో, పుట్టిన సర్టిఫికెట్, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలన్నారు.

భాజపా రైతు వ్యతిరేక ప్రభుత్వం

● ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూరి భూమయ్య


మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూరి భూమయ్య

డిచ్‌పల్లి, ఏప్రిల్ 30: రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్రంలోని బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలని, ఇండియా కూటమి లోని అభ్యర్థులను బలబర్చాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూరి భూమయ్య అన్నారు. మంగళవారం డిచ్‌పల్లిలో ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా రైతాంగానికి తీవ్ర అన్యాయం చేసిందని, మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలను రైతాంగానికి ఉపయోగం లేవన్నారు. ప్రస్తుతం రైతుల పంటల కు ధరలు లేక పెట్టుబడి భారంగా మారిందని అన్నారు. ఆదానీ, అంబానీలకు దేశ సోమ్మును దోచిపెడుతున్నారని అన్నారు. విలేకర్త సమావేశంలో నాయకులు దేవస్వామి, పీవైఎల్ ఉపాధ్యక్షుడు సాయినాథ్, దాస్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

ఎడపల్లి, ఏప్రిల్ 30: ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల మైనార్టీ నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎడపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో పాల్గొనేందుకు వచ్చిన మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ పార్లమెంటు జీవన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మక్తకు చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ మైనార్టీ నాయకుడు ఇర్ఫాన్, ఎడపల్లికి చెందిన మాజీ కో ఆప్షన్ మెంబర్ జహీర్ అహ్మద్, అన్వర్ పాషా, అజర్, అబ్దుల్ సమద్, అలీఖాన్, హుస్సేన్ తదితరులు ఉన్నారు.

మగ్గిడిలో వాలీబాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

ఆర్మూర్‌రూరల్, ఏప్రిల్30: ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం వేసవి వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. 15రోజుల పాటు వాలీబాల్ ఆటల్లో క్రీడాకారులకు మేళకువలు నేర్పనున్నట్టు వ్యాయమ ఉపాధ్యాయుడు మధు తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో ప్రత్యేక శిక్షణ ద్వారా మేళకువలు నేర్చుకున్న క్రీడాకారులను రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొనే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ సుద్దపల్లి నర్సయ్య, వీడీసీసభ్యులు పాల్గొన్నారు.

ఆగస్టులోపు రుణమాఫీ చేస్తాం :ఎమ్మెల్యే

ధర్పల్లి, ఏప్రిల్ 30: రైతులకు ఏకకాలంలో రెండులక్షల రుణమాఫీ ఆగస్టు లోపు పూర్తి చేస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గోవింద్‌పల్లితో పాటు వివిధ గిరిజన తాండాలో ఆయన సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అంతకుముందు మండల కేంద్రంలోగల పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు లోపు రైతులకు రెండులక్షల రుణమాఫీ చేసి తీరుతామని ఈ సందర్భంగా ఆయన రైతులకు భరోసా ఇచ్చారు. ఇప్పటికే ఐదు ఎకరాలలోపు రైతులందరికి రైతుబంధును వర్తింపజేసినట్లు ఆయన చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లో ఆరు గ్యారంటీలను చిత్తశుద్దితో అమలు చేశామని ఆయన పేర్కొన్నారు. నిజామాబాద్ ఎంపీగా జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అవుతారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్, మాజీ సర్పంచ్ మిట్టపల్లి గంగారెడ్డి, పార్టీ నాయకులు గాదారి మనోహర్‌రెడ్డి, చెలిమెల నర్సయ్య, ప్రవీణ్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, సుభాష్, చెలిమెల శ్రీనివాస్, వీడీసీ చైర్మన్ అర్గుల్ రాజేశ్వర్‌రెడ్డి, సురేందర్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, లాలాగౌడ్, మహేందర్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే భూపతిరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ధాన్యం లారీ బోల్తా పడ్డ దృశ్యం

ధాన్యం లారీ బోల్తా

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 30: ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీలో కామారెడ్డి రైస్‌మిల్‌కు తరలిస్తుండగా ఎల్లారెడ్డి-కామారెడ్డి ప్రధాన రహదారి వద్ద చర్చి పక్కన మూలమలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. సంబంధిత అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి ధాన్యం బస్తాలను వేరే లారీలో లోడ్ చేయించి ధాన్యాన్ని రైస్‌మిల్‌కు తరలించారు. ఈ సంఘటనలో లారీ ధ్వంసమైనట్లు తెలిపారు.

ఉద్యమ నాయకుడి మృతి



కుమ్మరి రాజయ్య(ఫైల్)

సదాశివనగర్, ఏప్రిల్ 30: మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన కుమ్మరి రాజయ్య (48) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో, ఇటీవల కామారెడ్డి మున్సిపల్ మాస్టర్‌ప్లాన్ వ్యతిరేక కార్యక్రమాల్లో రైతులతో కలిసి ముందుండి పోరాడిన వ్యక్తి అని తెలిపారు. అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ టీఆర్ఎస్ అధ్యక్షుడిగా ఉద్యమంలో ఎన్నో విపత్కర సంఘటనలు ఎదుర్కొని జైలుకు వెళ్లిన రాజయ్య మృతి తీవ్ర మనోవేదనకు గురి చేసిందని గ్రామస్థులు తెలిపారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా తేమ శాతం సేకరణ

సదాశివనగర్, ఏప్రిల్ 30: రైతులకు ఇబ్బందులు కలుగకుండా తేమ శాతం సేకరిస్తామని సింగిల్‌విండో సీఈవోలు దేవేందర్‌రావు, విగ్నేష్‌గౌడ్‌లు తెలిపారు. పద్మాజీవాడి సింగిల్‌విండో పరిధిలోని మోడిగాంలో 9,848 బస్తాలు, 62 మంది రైతుల నుంచి భూంపల్లిలో 400 బస్తాలు, 6 మంది రైతుల నుంచి, పద్మాజీవాడిలో 1,887 బస్తాలు 15మంది రైతుల నుంచి సేకరించామని తెలిపారు. సదాశివనగర్ సింగిల్‌విండో పరిధిలోని తిర్మన్‌పల్లిలో 14,280 బస్తాలు, 145 మంది రైతుల నుంచి సదాశివనగర్ 16,773 బస్తాలను 135 మంది రైతుల నుంచి సేకరించడం జరిగిందని తెలిపారు.

చాముండేశ్వరీ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

దోమకొండ, ఏప్రిల్ 30: మండల కేంద్రంలోని చాముండేశ్వరీ ఆలయాన్ని మాజీ ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ మంగళవారం సందర్శించారు. ఆలయంలో పూజలు నిర్వహించి అనంతరం పూజారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ పరిధిలోని బోరు ఫ్రెషింగ్ కోసం రూ.20వేలు ఆలయ కమిటీ సభ్యులకు గంప గోవర్ధన్ అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గండ్ర మధుసూదన్‌రావు, ఎంపీపీ కానుగంటి శారద, నాగరాజు, కుంచాల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో కామారెడ్డి వాసికి సిల్వర్ మెడల్

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 30: మూడవ రాష్ట్రస్థాయి మిడిల్ అండ్ లాంగ్ డిస్టెన్స్ పోటీల్లో కామారెడ్డి జిల్లాకు చెందిన క్రీడాకారుడు ఎం. ఈశ్వర్ అండర్ 20 ఇయర్స్ క్యాటగిరి 1500 మీటర్స్ విభాగంలో ద్వితీయ స్థానం (సిల్వర్ మెడల్) సాధించాడు. ఈ మెడల్‌ను సూర్యాపేట జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మరియు అసోసియేషన్ సభ్యులందరూ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

బీఆర్ఎస్‌కు నాగరాజుగౌడ్ రాజీనామా

బీబీపేట,ఏప్రిల్ 30: బీబీపేట మండల రైతుబంధు సమితి మండల అధ్యక్షుడిగా రెండు సంవత్సరాలు పదవి బాధ్యతలు నిర్వహించిన మందాపూర్ గ్రామానికి చెందిన అంకన్నగారి నాగరాజుగౌడ్ బీఆర్ఎస్ పార్టీ శాశ్వత సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత పార్టీలో ఉన్న మందాపూర్ గ్రామానికి చెందిన ముఖ్య నాయకుడి తీరు నచ్చక రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



మేడిపల్లిలో కుస్తీ పోటీల్లో తలపడుతున్న మల్లయోధులు

మేడిపల్లిలో కుస్తీ పోటీలు

గాంధారి, ఏప్రిల్ 30: మండలంలోని మేడిపల్లి గ్రామంలో కుస్తీ పోటీలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో కుస్తీ పోటీలను ప్రతీ సంవత్సరం నిర్వహించడం ఇక్కడ అనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా మంగళవారం పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు మండలంలోని కుస్తీ వీరులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఆంజనేయులు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన వారికి వెండి కడెంతో పాటు నగదును బహూకరించారు.

రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే కాంగ్రెస్‌నే గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

- బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను ఎత్తేస్తారు
- ప్రగతి భవన్‌ను బానిస భవన్‌లా మార్చిన కేసీఆర్
- మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 30: భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే ప్రజలు ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ అన్నారు. మంగళవారం సాయంత్రం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాలంటే కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, రాజ్యాంగాన్ని మార్చాలంటే బీజేపీకి ఓటు వేయాలన్నారు. తెలంగాణ ప్రజలు మంచి ఆలోచనపరులని, చైతన్యవంతులని అసెంబ్లీ ఎన్నికల్లో నిరూపించారన్నారు. కులాలు, మతాలను అడ్డుపెట్టుకుని బీజేపీ రాజకీయం చేస్తోందని, బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఉన్న రిజర్వేషన్లను కూడా తీసేస్తోందని, ప్రతీ ఓటరు ఆలోచించాల్సిన విషయం అన్నారు. అబ్‌కీ బార్ 400 పార్ అనే నినాదం కేవలం రాజ్యాంగాన్ని మార్చేందుకో సమేనన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలు ఆస్తులు పోతాయని ప్రధాని రెచగొట్టే వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం కుట్రలు చేస్తోందని, ప్రజలు గందరగోళానికి గురికావొద్దన్నారు. కాంగ్రెస్‌తోనే మార్పు సాధ్యమవుతందన్నారు. 10 సంవత్సరాలు పాలించిన ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌ను బానిస భవన్‌లా మార్చారన్నారు. 14 సీట్లిస్తే చక్రం తిప్పుతానని గొప్పలు చెప్పుకోవడం కేసీఆర్ విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. అదేవిధంగా బీఆర్ఎస్ నుంచి ఎంపీగా రెండు పర్యాయాలు చేసిన బీబీ పాటిల్ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు శూన్యమన్నారు. బీబీ పాటిల్ బిజినెస్ పాటిల్‌గా మారాడని, కేవలం ఆయన స్వార్థం కోసమే రాజకీయంలోకి వచ్చాడన్నారు. ప్రజలు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని, రాహుల్ గాంధీ ప్రధాని అవుతాడన్నారు. జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి బాల్‌కిషన్‌గుప్తా, మాసాని శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌సింగ్ రాథోడ్, కమలాకర్‌రెడ్డి, మోహరిల్ శ్రీనివాస్‌రావు, పాతబాలకృష్ణ గుప్త, గణేష్, వెంకట్‌రాంరెడ్డి, లక్ష్మీనారాయణమూర్తి, నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

ఆగష్టు 15న రైతు రుణమాఫీ పక్కాగా అమలు

- కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి

కాంగ్రెస్ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఆగష్టు 15న రూ.రెండు లక్షల రుణమాఫీ పక్కాగా అమలు చేస్తామని బాన్సువాడ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మాటిస్తే తప్పరని, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు రాజీనామా పత్రాలను స్పీకర్ ఫార్మాట్‌లో అందజేయాలని చురకలు వేశారు. రుణమాఫీకి సంబంధించి ఇప్పటికే బ్యాంకు అధికారులతో చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. అంతేకాకుండా బీఆర్ఎస్ హయాంలో ఇష్టారీతిన కమర్షియల్ స్థలాలకు సైతం రైతుబంధు ఇచ్చారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో చర్చలు జరిపి, అర్హులకే రైతుబంధు అందజేస్తుందన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూం బిల్లులకు తాను అడ్డు చెప్పలేదని, ఆరోపిస్తున్న నాయకులు తెలంగాణ తిరుమల దేవస్థానంలో దైవసాక్షిగా ప్రమాణం చేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే 6 గ్యారెంటీల్లో 5 గ్యారెంటీలను అమలు చేస్తోందన్నారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తి నమ్మకం ఉందని, రాబోయే ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంతోష్

గాంధారి, ఏప్రిల్ 30: గత రెండు రోజుల క్రితం గాంధారిలో గల నల్లాల బావిలో దొరికిన కుళ్లిపోయిన మృతదేహం గాంధారి మండల కేంద్రానికి చెందిన బుర్రి కీర్తనగా పోలీసులు గుర్తించారు. మంగళవారం సదాశివనగర్ సీఐ సంతోష్, ఎస్ఐ ఆంజనేయులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కీర్తన సొంత గ్రామం లింగంపేట మండలం కార్పోల్ 9 నెలల క్రితం గాంధారి మండల కేంద్రానికి చెందిన బుర్రి విజయ్‌తో వివాహం జరిగిందని భార్యభర్తలు ఇద్దరు పెళ్లైన కొన్నాళ్లకే బంధువుల అందరికి దూరంగా గాంధారిలో వేరే దగ్గర అద్దెకు ఉంటున్నారు. వాళ్ల కాపురంలో రోజు గొడవలు జరుగుతూ ఉండేవని, భార్యపై విజయ్‌కుమార్ అనుమానం పడి ఎలాగైన ఆమెను చంపేయాలని పతకం వేశాడని తెలిపారు. గాంధారి మండలానికి చెందిన ఓ మైనర్ బాలుడి సహకారంతో కీర్తనను చంపివేశారని తెలిపారు. విజయ్‌కుమార్ ఆమె గొంతుపట్టి పిసుకగా, కొన ఊపిరితో ఉన్న ఆమెను ఇద్దరు కలిసి మెడకు టవల్‌తో బిగించి ఉరివేసి చంపారని తెలిపారు. ఎవరికి అనుమానం రాకుండా గోనెసంచిలో కట్టి గాంధారి శివారులోని పాడైన బావిలో పడేశారని తెలిపారు. మృతురాలికి దగ్గరి బంధువుల ఎవరు లేకపోవడంతో ఎవరూ కూడా ఫిర్యాదు ఇవ్వలేదని గత మూడు రోజుల క్రితం రక్తసంబంధికులు అతన్ని బలవంతంగా చేయగా పీఎస్‌కు వచ్చి ఫిర్యాదు చేయడంతో గాంధారి పోలీసులకు భర్తపైనే అనుమానం ఉండడం విచారణ చేపట్టి అతను ఇచ్చిన వివరాలతో బావిలో వెతికి చూడగా కుళ్లిపోయిన స్థితిలో శవం లభించిందని తెలిపారు. ఇరువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

పదో తరగతి ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



సరస్వతి శిశుమందిర్‌లో విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

కామారెడ్డి రూరల్, ఏప్రిల్ 30:పదో తరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలోని విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారని ప్రిన్సిపాల్ నాగభూషణం తెలిపారు. వీరిలో శేషాద్రి, ధనుశ్రీ, వర్షిత 10 జీపీఏ సాధించినందుకు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

పెద్ద కొడప్‌గల్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని 3 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. అత్యధికంగా మండలంలోని వడ్లం పాఠశాలకు చెందిన విద్యార్థిని అనిత 9.5 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థిని దివ్య 9.3 మార్కులు సాధించి మండలంలో రెండో స్థానంలో నిలిచారు. వడ్లం, కాటేపల్లి, పెద్ద కొడప్‌గల్ బాలికల గురుకుల పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. పెద్ద కొడప్‌గల్ బాలుర ఉన్నత పాఠశాలలో 61 మంది విద్యార్థులకు గాను 60 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

బాన్సువాడటౌన్: పదో తరగతి ఫలితాల్లో బాన్సువాడ మండలం 87.51 శాతం ఉత్తీర్ణత సాధించింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు కలిపి మొత్తం 1129 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, అందులో 988 మంది ఉత్తీర్ణులయ్యారు. మోడల్ పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు 10 జీపీఏ, న్యూటన్స్ పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారని మండల విద్యాధికారి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని తిర్మలాపూర్ క్యాంపు ప్రభుత్వ పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించిందన్నారు.

బీర్కూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన యాట విఘ్నేష్ పదో తరగతి పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించాడు. ఉమ్మడి మండలాల్లో టాపర్‌గా నిలిచాడు. 10కి 10 జీపీఏ సాధించిన విఘ్నేష్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు, మండల ప్రజలు అభినందనలు తెలిపారు.

బీర్కూర్: మండలంలో పది పరీక్షా ఫలితల్లో 96.27 శాతం ఉత్తీర్ణులు అయ్యారని ఎంఈవో నాగేశ్వర్‌రావు తెలిపారు. మండలంలో 268 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా 258 మంది ఉత్తీర్ణులు అయ్యారు. కస్తూర్బాలో 48 మందికి 46 మంది విద్యార్థులు, మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో 67కు 67 మంది, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 118 మందికి 114 మంది, జడ్పీహెచ్ఎస్ ఉర్దూమీడియం పాఠశాలలో 16 మందికి 15 మంది, దామరంచ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 19 మందికి 16 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. బీర్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన యాట విఘ్నేష్ అనే విద్యార్థి పది పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచాడు.

నిజాంసాగర్: మండలంలోని 10 పాఠశాలల్లో 397 మంది విద్యార్థులు పది పరీక్షలురాశారు. బాలికలు 166, బాలురు 223 మంది ఉత్తీర్ణులై 97.99 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆదర్శ పాఠశాలలో 17 మంది బాల, బాలికలు 9 జీపీఏ సాధించారు. ఈ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్న మార సరస్వతి 9.5, అమృత 9.5 జీపీఏ సాధించారు.గురుకుల పాఠశాలలో 78 మంది బాలురు పరీక్షలు రాశారు. ఆకాష్ 9.7 గ్రేడింగ్ సాధించాడు. ఈ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ హెన్రీ తెలిపారు.

మద్నూర్: మండలంలోని మొత్తం 22 పాఠశాలల్లో వంద శాతం, రెండు పాఠశాలల్లో ఉత్తీర్ణత సాధించాయి. ఆయా పాఠశాలల్లో 4 విద్యార్థులు 9.8 గ్రేడింగ్ సాధించారు. మొత్తం 606 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 515 మంది ఉత్తీర్ణత సాధించారు. 91 మంది ఫెయిల్ అయ్యారు. మండల స్థాయి ఫలితాలు 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. డోంగ్లీ మండలంలో ప్రభుత్వ పాఠశాల నుంచి లక్ష్మీ 9.8 గ్రేడింగ్ సాధించగా, పెద్ద ఎక్లారా బాలికల పాఠశాలలో సిహెచ్ భువనేశ్వరీ 9.8 మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. తెలంగాణమోడల్ పాఠశాల మేనూర్ నుంచి శివానీ, శివ సేతన 9.8 గ్రేడింగ్‌సాధించారు. ఉమ్మడి మండల స్థాయిలో నలుగురు విద్యార్థులు మండల స్థాయి ర్యాంకర్లుగా నిలిచారు. 9.8 గ్రేడింగ్ సాధించిన వారికి ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు సన్మానించారు.

నాగిరెడ్డిపేట: మండలంలో పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు 90.58 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖ అధికారి వెంకటేశం తెలిపారు. మండలంలో 446 మందికి విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 404 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఆయన తెలిపార. 42 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు తెలిపారు. నాగిరెడ్డిపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి కేతావత్ అరవింద్ (9.8 జీపీఏ) సాధించి మండల టాపర్గఆ నిలిచినట్లు ఆయన తెలిపారు. మండల మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎం.డి.నబీల్ అహ్మద్ (9.7 జీపీఏ), ఎస్.రిషిత (9.7 జీపీఏ), నాగిరెడ్డిపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి అశ్విన్ (9.7 జీపీఏ)లు సాధించి ఈ ముగ్గురు విద్యార్థులు మండలంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ఎంఈవో వెంకటేశం తెలిపారు.

ఎల్లారెడ్డి: మంగళవారం విడుదల అయిన 10వ తరగతి పరీక్ష ఫలితాలలో ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విష్ణువర్ధన్ అనే విద్యార్థికి 10/100 జీపీఏ సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. విద్యార్థికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృతామూర్తి, ఆయనతో పాటు సిబ్బంది తల్లిదండ్రులు వారి గ్రామస్తులు అభినందించారు. మండలంలో రెండోస్థానంలో 9.8 గ్రేడ్‌తో ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులకు రెండో స్థానంలో నిలిచారు. 9.7తో మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. మొత్తం ఎల్లారెడ్డి మండలంలో 601 విద్యార్థులకు 548 మంది ఉత్తీర్ణులు అయినట్లు ఎంఈవో వెంకటేశం తెలిపారు.

దోమకొండ: దోమకొండ జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో పదవ తరగతిలో 98.78శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెడ్‌మాస్టర్ శరత్ కుమార్ మంగళవారం తెలిపారు. బక్కన్నగారి రోహిణి 10 జీపీఏ, సందెల అక్షిత 9.8, చిట్యాల సాహితి 9.8, కూర స్పందన 9.8 అలాగే కస్తూర్బగాంధీ పాఠశాలకు చెందిన విద్యార్థులు 33 మంది పరీక్షలకు హాజరుకాగా 33 మంది పాస్ అయినట్లు ప్రిన్సిపాల్ మమత తెలిపారు. 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. ఉదయ బాన్వాణి 9.3, శ్రీజ, రామేశ్వరీ 9.2, నందిని, సూజాత, స్పందన 9.2 జీపీఏ సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. అభ్యుదయ పాఠశాలకు చెందిన విద్యార్థులు 54 మంది పరీక్షలకు హాజరుకాగా 54 మంది ఉత్తీర్ణత సాధించినట్లు హెడ్‌మాస్టర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు విజ్ఞాతరెడ్డి, రుచిత 10.10జీపీఏ సాధించినట్లు ఆయన తెలిపారు.

లింగంపేట: మండలంలో మంగళవారం ప్రకటించిన పదవ తరగతి ఫలితాల్లో 95శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో రామస్వామి తెలి పారు. మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పర్మల్ల, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ లింగంపేట, మైనారిటి రెసిడెన్షియల్ పాఠశాల లింగంపేటలలో 100శాతం ఉత్తీర్ణత సాధించగా, జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో 98శాతం, లింగంపేట బాలుర, పోతాయిపల్లి పాఠశాలల్లో 96శాతం, నల్లమడుగు, మోతె పాఠశాలల్లో 95శాతం, కస్తూర్బాగాంధీ పాఠ శాలలో 93శాతం, పొల్కంపేట పాఠశాలలో 91శాతం, అయిలాపూర్, శెట్పల్లిసంగారెడ్డి పాఠశాలల్లో 89శాతం, భవానిపేటలో 88శాతం, బాపూర్‌లో లింగంపల్లి ఖుర్దు 81శాతం, 80శాతం, శెట్పల్లిలో 75శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలియజేశారు. మండలంలో మొత్తం 546మంది పరీక్షలు రాయగా 516మంది ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలియజేశారు. బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన క్రిష్ణవేణి 9.8జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు ఆయన తెలిపారు.

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి జ్యోతిబా పూలే పాఠశాల విద్యార్థులు 10మంది, జంగంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థినీ ఎస్‌కె సనా 10జీపీఏ సాధించి టాపర్లుగా నిలిచారు. జంగంపల్లి జ్యోతిబా పూలే పాఠశాల, జంగంపల్లి కేజీబీవీ పాఠశాల, పెద్దమల్లారెడ్డి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, కాచాపూర్ ప్రభుత్వ పాఠశాల, తిప్పాపూర్ ప్రభుత్వ పాఠశాల, భిక్కనూరు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, భిక్కనూరు ప్రైవేటు పాఠశాలలు శ్రీ చైతన్య, విజ్ఞాన్, సిద్దార్థ 100శాతం ఉత్తీర్ణత సాధించగా, బాగిర్తిపల్లి ఉన్నత పాఠశాల 83శాతం, జంగంపల్లి ఉన్నత పాఠశాల 91శాతం, భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాల 96.7శాతం, బాలికల ఉన్నత పాఠశాల 81.96శాతం, బస్వాపూర్ ఉన్నత పాఠశాల 93.93శాతం, పెద్దమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాల 90.7శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కాగా భిక్కనూరు మండలంలోని సిద్దరామేశ్వరనగర్ గ్రామానికి చెందిన దివ్యాంగ విద్యార్థి గర్దాస్ ప్రభాస్ 7.5జీపీఏ సాధించి ఔర అనిపించాడు.

'ఉపాధి' పనుల వద్ద సౌకర్యాలను కల్పిస్తున్నాం

- ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

భిక్కనూరు, ఏప్రిల్ 30: ఉపాధి హామీ పనుల వద్ద కూలీల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను చేయ్యడం జరిగిందని భిక్కనూరు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎండ తీవ్రత నేపథ్యంలో కూలీలకు షేర్ నెట్‌లను ఏర్పాటడు చేయ్యడంతో పాటుగా తాగు నీటి వసతిని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేయ్యడం జరుగుతుందన్నారు. కూలీలు సైతం జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అనంతరం గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా చేపట్టాల్సిన పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రాధిక, గ్రామపంచాయితీ ఈవో లక్ష్మీ, ఆయాశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధురాలి మృతి

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్), ఏప్రిల్ 30: మహ్మద్‌నగర్ మండలంలోని గిర్ని తండాకు చెందిన మీరాబాయి (68) మంగళవారం వడదెబ్బ తగిలి మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. వరి కుప్ప వద్దకు వెళ్లిన మీరాబాయి స్పృహ తప్పి పడిపోయి, మృతిచెందినట్లు పేర్కొన్నారు. హుటా హుటీన ఇంటికి తరలించగా, మృతిచెందిందని, ఎండ వేడిమి అధికంగా ఉండటంతో వడదెబ్బ తగిలి మృతిచెందినట్లు తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

భిక్కనూరు, ఏప్రిల్ 30: మండలంలోని కాచాపూర్ గ్రామానికి చెందిన బీర్కూరి మైసయ్య గత రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురై మృతిచెందాడు. ఈ మేరకు మంగళవారం నిరుపేద కుటుంబమైనా మృతుడి కుటుంబసభ్యులకు అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో సేవా కార్యక్రమాలను కొన సాగిస్తామన్నారు. కార్యక్రమంలో అమ్మఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బెల్టు షాపులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడి

లింగంపేట, ఏప్రిల్ 30: మండలంలోని పర్మల్ల, లింగంపేట గ్రామాలలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు దుకాణాలపై మంగళవారం ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఇంచార్జీ ఎస్సై గంగాధర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆకుల సాయిలు అనే వ్యక్తి తన ఇంట్లో అక్రమంగా నిలువ ఉంచిన రెండున్నర లీటర్ల విస్కీ బాటిళ్లు, 15లీటర్ల బీరు బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఎల్లారెడ్డి ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. మండలంలోని పర్మల్ల గ్రామంలో నాందేవ్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిలువ ఉంచిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకునికేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. పర్మల్లలో స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ల వివరాలను బుధవారం వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నా యదేచ్ఛగా బెల్టు షాపులు నిర్వహిస్తూ మద్యం విక్రయాలు చేపడుతున్నందున ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సదాశివనగర్‌లో 97 శాతం ఉత్తీర్ణత

సదాశివనగర్, ఏప్రిల్ 30: మండలంలో పదోతరగతిలో 97శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖధికారి యోసప్ తెలిపారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు భూంపల్లి, పద్మాజీవాడి, తుక్కోజువాడి, కల్వరాల్, మర్కల్, వజ్జేపల్లిలు 100శాతం ఉత్తీర్ణత సాధించగా సదాశివనగర్ 96శాతం, అడ్లూర్ ఎల్లారెడ్డిలో 89 శాతం, కుప్రియల్‌లో 78శాతం,ధర్మారావుపేట 96శాతం, ఉత్తునూర్ 97శాతం సాధించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల నుండి అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన సిమాన్, ఉమ 10/10 జీపీఎస్ సాధించినట్లు తెలిపారు. ఆదర్శ పాఠశాల 100శాతం ఉత్తీర్ణతతో 11 మంది విద్యార్థులు 10/10 జీపీఏలు సాధించినట్లు ఆయన తెలిపారు.

తాడ్వాయిలో 95.48 శాతం ఉత్తీర్ణత

తాడ్వాయి, ఏప్రిల్ 30: తాడ్వాయి మండలంలో పదోతరగతి పరీక్షల్లో 95.48శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో రామస్వామి తెలిపారు. మండలంలోని 16 ఉన్నత పాఠశాలలో 487 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా 465 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.మండలంలోని కృష్ణాజీవాడి జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో శ్రుతి, వైష్ణవి, కీర్తనశ్రీవల్య,శ్రీనిధి, పవిత్ర, జహ్నవిలు 10/10 జీపీఏ సాధించారు.

చెట్టుకు ఢీకొన్న వాహనం

- ఏడుగురికి తీవ్ర గాయాలు

మాచారెడ్డి, ఏప్రిల్ 30: మాచారెడ్డి మండలం ఘన్‌పూర్(ఎం)శివారులోని ఎల్లమ్మ ఆలయం వద్ద బొలేరో వాహనం చెట్టుకు ఢీకొనడంతో ఏడుగురు తీవ్ర గాయాలపాలైనట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. నాందేడ్ నుంచి వేములవాడలో దైవ దర్శనానికి బొలేరో వాహనంలో వెళ్తుండగా మాచారెడ్డి మండలం ఘన్‌పూర్(ఎం) గ్రామ శివారులోని ఎల్లమ్మ ఆలయ సమీపంలో వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొట్టింది. దీంతో ఆ వాహనంలో ఉన్న ఏడుగురికి తీవ్ర గాయాల య్యాయి. గాయాలపాలైన వారిలో నాందేడ్‌కు చెందిన చంద్రకళ, చౌకోట్ టాంగ్లే, సంతోష్, శశికళ, అశ్విని, భాగ్యశ్రీ, గణపతి, లక్ష్మణ్‌లు ఉన్నారు. స్థానికులు ప్రమాదాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు 108కు సమాచారం అందించడంతో వారు అంబులెన్స్‌లో కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.





గాయాలపాలైన చిన్నారులు





తలకు గాయమై చికిత్స పొందుతున్న గణపతి, లక్ష్మణ్

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	మనజుమిల్ బాయ్స్
శాంతి	టిల్లు స్క్వేర్
ప్రియా 70	ది ఫ్యామిలీ స్టార్
ప్రియా 35	గీతాంజలి మళ్లీ వచ్చింది

బాన్సువాడ	
మహేశ్వరి	గీతాంజలి
వెంకటేశ్వర	రత్నం

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	100	160	180
వెన్‌కాబ్(కిలో)	100	180	210